క్లుప్తంగా

గీతాపారాయణంపై శిక్షణ



గీతాపారాయణ చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బలగ హరేరామ హరేకృష్ణ మందిరంలో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భగవద్గీ అధ్యాయాలపై ఆదివారం ఉచితంగా తరగతులు నిర్వహించారు. చిన్మయానంద స్వామిజీ చిన్నారులకు భగవద్గీతలోని అధ్యయన శ్లోకాలను నేర్పారు.

ఘనంగా హనుమాన్ జెండా పండుగ



హనుమాన్ జెండాలతో గ్రామస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట గ్రామంలో ఆదివారం హనుమాన్ జెండా పండుగను వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నగర సంకీర్తన బృందం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేశారు. హనుమాన్ జెండా ప్రతిఒక్కరిలో ధైర్యం నింపుతోందని, ప్రతి ఇంటిపై జెండా పెట్టాలని వేద పండితులు సూచించారు. గ్రామంలో జెండాలు పంపిణీ చేశారు.

లోక కల్యాణార్థం గాయత్రీ మహాయజ్ఞం



గాయత్రీ యజ్ఞం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: లోక కల్యాణం, వాతావరణ కాలుష్యం నివారణకు గాయత్రీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు గాయత్రి పరివార్ శాంతికుంజ్, హరిద్వార్ రాష్ట్ర సమన్వయకర్త మూర్తి అన్నారు. గురజాడ విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామి నాయుడు దంపతులతో ఆదివారం గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, విద్యా సంస్థల డైరెక్టర్ సంయుక్త, తదితరులు పాల్గొన్నారు.

అలికాంలో స్వచ్ఛభారత్



అలికాంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని అలికాం గ్రామంలోని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలోని రహదారులను శుభ్రం చేశారు. అలికాం పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పచ్చదనం–పరిశుభ్రతపై గ్రామస్తులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.ఎస్.రాయ్, అనీల్, గ్రామ సర్పంచ్ రంధి అప్పలస్వామి పాల్గొన్నారు.

హరేరామ సంకీర్తనతో ముక్తికి మార్గం



బలగ మందిరంలో సంతోష్ బ్రహ్మ ప్రసంగం

శ్రీకాకుళం కల్చరల్: కలియుగంలో హరేరామ నామ సంకీర్తన ఒక్కటే ముక్తికి మార్గమని సంతోష్ బ్రహ్మ అన్నారు. స్థానిక బలగలోని హరేరామ హరేకృష్ణ మందిరం పునః ప్రతిష్ఠ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహించారు. కలియుగంలో పూజలు, హోమాలు చేసే అవకాశం లేని కారణంగా నామ సంకీర్తన ద్వారా ముక్తి మార్గం ఉందని పెద్దలు తెలిపారన్నారు. ముందుగా సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. బలగ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొయ్యాంలో గ్రామ దేవత ఉత్సవాలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాంలో పదేళ్లకోసారి నిర్వహించే గ్రామ దేవత ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 25వ తేదీ వరకు పండుగలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం శనప కార్యక్రమం నిర్వహించి గ్రామ పెద్దలు సమక్షంలో పండుగ ప్రారంభించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: ప్రజలకు మరింత చేరువై వారి మద్దతుతో 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగురవేసేలా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సైనికుల్లా పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నిద్దాం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని వాటిని తిప్పికొట్టాలన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. వీటికి నిదర్శనం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. 75 ఏళ్ల క్రితం గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని ఇప్పుడు చూస్తున్నామన్నారు. అయితే కొన్ని మీడియా సంస్థలు అభివృద్ధిని ప్రజలకు చూపకుండా అసత్య ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశారన్నారు. సమావేశంలో ఎంపీపీ మీసాల సత్యవతి, వైస్ ఎంపీపీ మీసాల సాద్వీమణి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల సచివాలయం, గృహసారథుల కన్వీనర్ డోల వెంకటరమణ, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏర్నేన ప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, బూత్ కన్వీనర్ ఎ.జగన్నాథం, పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, మీసాల రాంబాబు, ఏర్నేన శ్రీనివాసరావు, నల్లి తవిటినాయుడు, ముగ్గు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



జిల్లా బాడ్మింటన్ క్రీడాకారులతో సూర శ్రీను

శ్రీకాకుళం న్యూకాలనీ: బాల్ బాడ్మింటన్‌లో రాణించి, జిల్లా కీర్తి ప్రతిష్ఠతలను అంతర్జాతీయ స్థాయికి చేర్చాలని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా కావలిలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన 7వ ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను సూర శ్రీను ఆదివారం తన నివాసంలో అభినందించారు. పోటీలకు పాల్గొనేముందు తమకు క్రీడాదుస్తులతోపాటు ఆర్థిక సహాయాన్ని అందజేసినందుకు క్రీడాకారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సింగూరు నందిని, ముంత గాయత్రిలను శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. ఆటలతో పాటు చదువుల్లోనూ ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులకు, గురువులకు, శిక్షకులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం సహాయ కార్యదర్శి, శిక్షకుడు ఎం.మధుసూదనరావు, ఎ.కృష్ణ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ ఎంపీని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఝాన్సీలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

లావేరు: విజయనగరం మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నాయకురాలు బొత్స ఝాన్సీలక్ష్మిని మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం కలిశారు. చీపురుపల్లి మండలం దేవరపాదిలాం గ్రామానికి వెళ్తున్న ఆమెను మండలంలోని వెంకటాపురం గ్రామం వద్ద వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మండల మాజీ కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు, మాజీ మండల అధ్యక్షుడు వట్టి సత్యన్నారాయణ, మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, వార్డు మెంబరు ఇప్పిలి క్రిష్ణ, నాయకులు లుకలాపు సూర్యనారాయణ, పిన్నింటి బాలకృష్ణ తదితరులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకుల యోగక్షేమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం



డి.ఆర్.వలసలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సకాలంలో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని..అదే వ్యాక్సిన్‌గా పని చేస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. డి.ఆర్.వలస సెక్టార్‌లోని పున్నాం, బాతువ, బూటుపేట, డి.ఆర్.వలస అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన పోషణ్ అభియాన్ ఇంటింటి పోషణ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రిపాలు పెట్టడం ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోందని అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహార వస్తువుతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రొక్కం దుర్గమ్మ, ఎస్.హైమవతి, రమణమ్మ, త్రినాథమ్మ, రత్నం, సరస్వతి పాల్గొన్నారు.

కుళాయి పైప్‌లైన్ పనుల పరిశీలన

జి.సిగడాం: గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి చెప్పారు. ముషినివలస, పెనసాం, అద్వానంపేట, ఆనందపురం, డి.ఆర్.వలస గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఇంటింటికీ కుళాయి పైపులైన్ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రతి పంచాయతీలో జనాభా ఆధారంగా బోరులు, పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటి పథకాలను సమకూర్చుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను సుందరంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతోందని.. వీటికి ప్రజలు, యువత సహకరించాలన్నారు. గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండాఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాయకులు బూరాడ వెంకటరమణ, బుడారి లక్ష్మణరావు, చిత్తిరి మోహన్, కుమరాపు శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



గాంధీ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తున్న సత్యవతి, పార్టీ శ్రేణులు

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని చూసి బీజేపీ భయపడుతుందని.. కోర్టు ఆదేశాల నెపంతో కావాలనే పార్లమెంట్ నుంచి అనర్హత వేటు వేయించిందని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి ఆరోపించారు. ఏఐసీసీ ఆదేశాల నేపథ్యంలో పీసీసీ పిలుపుమేరకు రాహుల్ గాంధీకి మద్దతుగా శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మహాత్మాగాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సత్యవతి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రశ్నించే వారిపై దౌర్జన్యకాండ, తప్పుడు కేసులు పెట్టడం, స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థలైన సీబీఐ, ఈడి, సుప్రీంకోర్టు వంటి వ్యవస్థలను పావుగా వాడుకుందని ఆరోపించారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు, రాజకీయ నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం అన్యాయమన్నారు.

హక్కులను కాలరాయడం సరికాదు..

ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకపక్షానికి, విపక్షానికి పార్లమెంట్‌లో సమానమైన అధికారాలు ఉంటాయని గుర్తుచేశారు. పాలకపక్షం ఏదైనా తప్పు చేస్తే దాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానినకి ఉంటుందన్నారు. అయితే ఇటీవల కాలంలో ఆదాని, అంబానీ, మోడీల మధ్య ఉన్న సంబంధాన్ని పార్లమెంట్‌లో సాక్షాధారాలతో రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, తప్పుడు కేసులను బనాయించిన విషయాన్ని దేశ ప్రజలంతా చూశారన్నారు. అన్ని రాజకీయ పక్షాలు ఖండించాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు గొవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, ఈశ్వరి, రాజేశ్వరరావు, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిద్దాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

జి.సిగడాం: నిద్దాం గ్రామంలో సోమవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నిర్వహిస్తారని ఎంపీపీ మీసాల సత్యవతి ఆదివారం తెలిపారు. కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలన్నారు. సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలని సూచించారు.

మొక్కజొన్న పంటకు నష్టం



కేశవరాయునిపురంలో నేలమట్టమైన మొక్కజొన్న

లావేరు: కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షంతోపాటు గాలులకు మొక్కజొన్న పంటకు నష్టం చేకూరిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవరాయునిపురం, లావేరు, లావేటిపాలెం, రామునిపాలెం, అప్పాపురం, వెంకటాపురం, లింగాలవలస, పోతయ్యవలస, మురపాక, గురుగుబిల్లి, గోవిందపురం, ఇజ్జాడపాలెం, భరిణికాం తదితర గ్రామాల్లో రైతులు మొక్కజొన్నను సాగు చేశారు. అయితే పంట కోత దశకు వస్తున్న సమయంలో కురిసిన వర్షాలతో పాటు గాలులు వీడయంతో నేలమట్టం అయిందని రైతులు వాపోతున్నారు. కొద్ది రోజుల్లో పంట చేతికి రావాల్సి ఉండగా గాలుల కారణంగా పంట నేలమట్టం కావడంతో నష్టపోయామని.. పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందంటున్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బలివాడ, మిత్తనపేట గ్రామాలకు చెందిన మొక్కజొన్న పంటపై రైతులకు సింజెంట్ కంపెనీ ప్రతినిధులు ఆదివారం అవగాహన కల్పించారు. ఎన్‌కే 7720 అనే హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలు సాగుచేయడం ద్వారా రబీ కాలంలో 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించవచ్చునన్నారు. టెరిటరీ మేనేజర్ నవీన్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ భాస్కరరావు, తంగి సురేష్, డొంకాడ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

30 నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 30 నుంచి శ్రీరామ నవమిని పురస్కరించుకుని పట్టణంలో పలుచోట్ల సీతారాముల కల్యాణ ఉత్సవాలు చేపట్టనున్నారు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకల జరుగుతాయని ఆలయ అర్చకులు శేషాచార్యులు తెలిపారు. అలాగే పుణ్యపువీధిలోని సతారామ చంద్రమూర్తి సహిత సువత్సల అభియాంజనేయ స్వామి వారి ఆలయంలో కూడా సీతారాముల కల్యాణ వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు తెలిపారు. తొమ్మిదిరోజుల పాటు నిర్వహించే ఈ కల్యాణోత్సవాల సందర్భంగా ప్రతి రోజు పూజలు నిర్వహిస్తామన్నారు. 9న స్వామివారి కల్యాణం ఉంటుందన్నారు. పలు సత్యసాయి మందిరాలలో కూడా అదేరోజు కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలోని రంగనాథ స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవం ఆదివారంతో ముగిసింది. మూడు రోజులపాటు శ్రీకూర్మం దేవస్థానం వేద పండితుల ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు విశేష హోమాలు, పూర్ణాహుతి జరిగింది.

పౌష్టికాహారం అందించడమే సీఎం జగన్ లక్ష్యం



రాగిజావ పంపిణీ చేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

- యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆరోగ్యంగా ఉంటే ఆనందంగా చదువుకోవచ్చన్న ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వారంలో మూడు రోజులు బెల్లం, రాగిజావ అందించడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో అరసవల్లి, ఆదిత్యనగర్‌కాలనీలో గల ఎలిమెంటరీ స్కూళ్లను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించేందుకు నాడు–నేడు కింద స్కూళ్లను అభివృద్ధి చేయడంతోపాటు మంచి ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. 15 రకాలతో పౌష్టికాహారం అందించేందుకు ఏటా రూ.1824కోట్లు ఈ ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రాగిజావను యువనేత పంపిణీ చేశారు. కరంచంద్, వైస్‌ఎంపీపీ చంద్రమౌళి, అప్పుయాదవ్, తెలుగు రమేష్, సిజు, లక్ష్మణ్, పద్మావతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతోనే విజ్ఞానం సాధ్యం



ఎచ్చెర్ల: బహుమతులతో విద్యార్థులు



లావేరు గ్రంథాలయంలో సుమతీ శతకం చెబుతున్న విద్యార్థి

ఎచ్చెర్ల: పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం సాధ్యమని.. అలాగే మనసు ప్రశాంతంగా ఉంటుందని ధర్మవరం శాఖా గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు అన్నారు. 'చదవటం మాకిష్టం' కార్యక్రమాన్ని గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొప్పవాళ్ల జీవిత చరిత్రలను చదివి వారి గురించి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించడం, వేమన శతకం, సుమతీ శతకం, నీతి కథలు, రామాయణం, భారతం వంటివి చదివించారు. కథలు చెప్పడంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఆర్.రోహిత్, సీహెచ్ వెంకీ, ఎం.దీపిక, ఎం.నవ్యలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, పాఠకులు సూరిబాబు, మహేష్, జగదీష్, సురేష్, మధు, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

లావేరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని లావేరు, మురపాక శాఖాగ్రంథాలయాల అధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. రెండు గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు వేమన, సుమతీ శతకాలు చెప్పడంపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం చదవడం మాకిష్టం, చిల్డ్రన్స్ క్లబ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సమితి సేవలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లింగరాజు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో సత్యసాయి సేవాసమితి సేవలను విస్తృతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు కోరారు. స్థానిక పాలకొండ రోడ్డులో ఉన్న సత్యసాయి పెద్దమందిరంలో సమితులు, భజన మండళ్లు, సమన్వయకర్తలు, జోనల్ కన్వీనర్లు, తదితరులతో జిల్లా స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు.

జిల్లాలో హిరమండలంలో నిర్వహిస్తున్న ప్రేమ్ సాయి వృద్ధాశ్రమం సేవలపైన, రిమ్స్, టెక్కలి ఆస్పత్రులలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ సేవా సంఘం నిర్వహణపై సమీక్షించారు. సాయి గణేష్ మందిరంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం సేవలపై చర్చించారు. పర్తియాత్ర ఇన్‌చార్జి కాసం శ్రీనివాసరావు, జిల్లా సేవాదళ్ కో ఆర్డినేటర్ ఎస్.రామచంద్రరావు, అమ్మాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

రణస్థలం: వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు రణస్థలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బీహెచ్ కిరణ్ మహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఈబీ కార్యాలయం ఆవరణంలో ఆ రోజు ఉదయం పది గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు రూ. వెయ్యి డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని సూచించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నృత్యం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని విశాఖ పాఠశాలలో శనివారం రాత్రి పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ డాక్టర్ కె.మధుసూదన్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడంలో తమ స్కూల్ ముందువరుసలో ఉంటుందన్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేసి పాఠశాల తరఫున బెస్ట్ విశెష్ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల వైస్ చైర్మన్లు డాక్టర్ గీతా ప్రియదర్శిని, ప్రీతి నిహారిక, హెచ్ఎం పి.రామారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కవి కుమారరాజుకు సత్కారం



కుమారరాజుకు సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుంటూరు సాహితీ కిరణాల ఆధ్వర్యంలో జరిగిన శోభకృత్ ఉగాది వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లాకు చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కవి బుర్రి కుమారరాజును సత్కరించారు. కార్యక్రమంలో సంపాదకులు గుదిబండ వెంకటరెడ్డి, కథా రయిచత కూర చిదంబరం, పొత్తూరి సుబ్బారావు సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కవులు ఈవేమన, ఉమాకవి, యు.రమణమూర్తి తదితరులు అభినందించారు.